క్లుప్తంగా

అవగాహనే సుగర్ వ్యాధికి మందు



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సామర్లకోట: సుగర్ వ్యాధి రాకుండా అవగాహన పెంచుకోవడమే మందు అని డాక్టర్లు మహోన్నత్, వల్లీ, శ్రీదేవి తెలిపారు. డయాబెటిక్ డే సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో శ్రీభీమేశ్వర లయన్స్ క్లబ్, హైదరాబాద్‌కు చెందిన విర్కో లేబరేటరీస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుగర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి రోజు కనీసం గంట పాటు వ్యాయామంపై దృష్టి సారించాలని సూచించారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు 350 మందికి పరీక్షలు చేయించుకున్నారని క్లబ్ సభ్యుడు, కౌన్సిలర్ సేపెని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, విర్కో జీఎం ఎన్వీ రాఘవాచారి, క్లబ్ అధ్యక్షుడు వైఆర్ఎస్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకులకు సీఐ కౌన్సెలింగ్



వేట్లపాలెం యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: వేట్లపాలెం మంగాయ్యమ్మ కాలనీకి చెందిన 14 మందిని గురువారం రాత్రి సీఐ కృష్ణభగవాన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. వారిని ఎందుకు పోలీసు స్టేషన్‌కు పిలిపించారో తెలియక పోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పోలీసు స్టేషన్ వచ్చి, యువకులను ఎందుకు పిలిపించారో చెప్పాలని ప్రశ్నించారు. దాంతో సీఐ కృష్ణభగవాన్ మాట్లాడుతూ, మంగాయ్యమ్మ కాలనీలో గుంపులుగా ఉంటూ, మహిళలతో అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. అయితే వారంతా కూలీ పని చేసుకునే వారని, అల్లరిగా తిరిగే వారు కాదని ఎంపీపీ భరోసా ఇచ్చారు. వారు తప్పు చేసిన్నట్లు రుజువైతే చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో శుక్రవారం రాత్రి ఇరు వర్గాలను పిలిపిస్తానని సీఐ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం గొల్లప్రోలు మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గొల్లప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు, గొల్లప్రోలు మండలం తాటిపర్తి వాటర్ వర్క్స్, బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సామర్లకోటలో..

సామర్లకోట: పట్టణంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, కుమ్మరవీధి, కోటపేట, పాత తహసీల్దార్ కార్యాలయం, పెద్ద బజార్, బలుసులపేట, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, సంగీతరావుపేట, మెహర్ కాంప్లెక్స్, హెడ్ పోస్టాఫీసు, ఇండస్ట్రియల్ ఏరియాలో అంతరాయం ఏర్పడుతుంద న్నారు.

పంచారామ క్షేత్రంలో చిరంజీవి కుమార్తె పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో మెగాస్టార్ చిరంజీవి కుమార్తె (నీలం రంగు చీర ధరించిన మహిళ)

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో మెగాస్టార్ చిరంజీవి పెద్ద కుమార్తె సుష్మిత గురువారం స్వామి,అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా పిఠాపురం నుంచి సామర్లకోట వచ్చిన ఆమెకు ఆలయ పండితులు స్వాగతం పలికి కాలభైరవస్వామి, ధ్వజస్తంభం, పెద్దనంది, మూలవిరాట్, ఉప ఆలయాలను, స్వామి, అమ్మవారి దర్శనం చేయించారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

ప్రభుత్వాస్పత్రి

సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418

హరోం హరా..

- పరమ పవిత్రం కార్తిక పౌర్ణమి
- పంచారామ క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రస్తుత తరుణంలో పండగలంటే బెంబేలెత్తుతున్న జనం
- పెరుగుతున్న నిత్యావసర ధరలే కారణం



పౌర్ణమి అమ్మకాలకు సిద్ధంగా ఉన్న పూజా సామగ్రి, పండ్లు



విద్యుద్దీపాల అలంకరణలో పంచారామ క్షేత్రం

సామర్లకోట: కార్తిక మాసంలో పవిత్రమైన కార్తిక పౌర్ణమి రానే వచ్చింది. ఆ రోజున భక్తులు భారీగా ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేస్తుంటారు. స్థానిక పంచారామ క్షేత్రంలోనూ కార్తిక పౌర్ణమికి భక్తులు భారీగా రానున్నందున, ఆ మేరకు దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పండగలంటే కుటుంబ సమేతంగా సంతోషంగా గడిపే రోజులు కనుమరుగయ్యాయి, కార్తిక మాసంలో వచ్చే పౌర్ణమిని ఎంతో పవిత్రంగా భావించి, పూజలు చేస్తుంటారు. దాంతో కొత్తగా పెళ్లయిన దంపతులు మొక్కులు తీర్చుకోవడానికి శివాలయాలకు వెళతారు. ఈ మేరకు కార్తిక పౌర్ణమి రోజున ఆలయాలు కిటకిటలాడుతాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేసి, వారి గోత్రాల మేరకు తోరాలు, పత్రిని కొనుగోలు చేసి, సాయంత్రం చంద్రుడు దర్శనమిచ్చాక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉపవాస దీక్షను విరమిస్తారు.

అమ్మో.. పిండివంటలే..!

కార్తిక పౌర్ణమి రోజున అనేక రకాల పిండి వంటలు చేస్తారు. అయితే పెరిగిన ధరలతో ఆందోళన కలుగుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరమేశ్వరునికి బూరెలు, గారెలు, అరిసెలు నైవేద్యంగా పెట్టి పూజలు చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర ధరలు పెరిగాయని, ధరలు అదుపు చేసే ప్రయత్నాలు కనిపించడం లేదని భక్తులు వాపోతున్నారు. చౌక దుకాణాల్లో ఇచ్చే బియ్యంతో బియ్యం పిండి చేసుకోవాలని ప్రయతిస్తే, ఈ నెలలో ఇచ్చిన బియ్యం పురుగులతో నిండి ఉందని మహిళలు ఆరోపించారు. రేషన్ ద్వారా పప్పులు, నూనె ఇస్తామని ప్రకటనలు చేసినా, ఇప్పటి వరకు అందజేయలేదని అంటున్నారు. దాంతో బియ్యం పిండి, నూనె, పప్పులు, బెల్లం తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి పండగకు ముందుగా ఏదో ఒక సంక్షేమ పథకం అమలు చేయడంతో, ప్రజల చేతిలో నిత్యం ఎంతో కొంత డబ్బు ఉండేదని చర్చించుకుంటున్నారు.

పెరిగిన ధరలతో భక్తులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం కొన్ని నిత్యావసరాల ధరల వివరాలిలా..

నిత్యావసరాలు	ఆరు నెలల క్రితం(రూ.ల్లో)	ప్రస్తుతం(రూ.ల్లో)
వంట నూనె కేజీ	80	150
మినప పప్పు కేజీ	70	110
కంది పప్పు కేజీ	100	160
బెల్లం కేజీ	45	55
శనగ పప్పు కేజీ	70	95
పంచదార కేజీ	38	43
బియ్యం కేజీ	45	56
బియ్యం పిండి కేజీ	40	50

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలివే..

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజామున స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహిస్తారు. కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం ఉంటుంది. ఆలయ భక్త సంఘం అధ్యక్షుడు బిక్కిన సాయి కుటుంబ సభ్యులతో లక్ష పత్రి పూజ ఉంటుంది. సాయంత్రం ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపోత్సవం జరుగుతుంది. ఆలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరుతుంది. రాత్రి ఆలయ ప్రాంగణంలో గడ్డితో జ్వాలాతోరణం ఏర్పాటు చేస్తారు. జ్వాలా తోరణాన్ని వెలిగించిన తరువాత పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి, మూడు పర్యాయాలు హరహర మహదేవ శంబోశంకరా అంటూ భక్తులు పల్లకీని తిప్పుతారు. మూడు పర్యాయాలు పూర్తయిన వెంటనే భక్తులు జ్వాలాతోరణంలో ఉన్న కొబ్బరి కాయలు, కాలిన గడ్డిని తీసుకోవడానికి పోటీ పడతారు.

భయపడే రోజులొచ్చాయి



పండగలకు బంధువులు వస్తున్నారంటే భయపడే రోజులు వచ్చాయి. గతంలో బంధువులతో ఆనందంగా గడిపిన రోజులను మాత్రమే నెమరు వేసుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, బియ్యం, పప్పులు, నూనె ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పండగలు జరుపుకోవడానికి అప్పులూ పుట్టడం లేదు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు.

– కర్రి వెంకటలక్ష్మి, గృహిణి, సామర్లకోట

శివుడిని దర్శించుకోవాలి



కొత్తగా పెళ్లయిన దంపతులు కందమొక్క, గుమ్మిడి కాయలతో కలిపి స్వామివారికి స్వయం పాకం సమర్పించాలి. శుక్రవారం రోజున పౌర్ణమి రావడం ఎంతో మంచి పరిణామం. ఆ విధంగా చేయడం వలన వంశపారంపర్యంగా కుటుంబం వృద్ధి చెందుతుంది. అనేక మంది కార్తిక మాసంలో నోములు చేస్తారు. సామర్లకోట పంచారామ క్షేత్రంలో సాయంత్రం జ్వాలా తోరణం జరుగుతుంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీచక్ర పండితుడు, పంచారామ క్షేత్రం, సామర్లకోట


భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం



కార్తిక పౌర్ణమి రోజున కొత్త దంపతులు ఎక్కువగా వచ్చి, స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుంటారు. వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయంలో పౌర్ణమి పూజలు నిర్వహించి, మధ్యాహ్నం స్వామి వారి గ్రామోత్సవం, సాయంత్రం జ్వాలా తోరణం ఏర్పాటు చేశారు. జ్వాలా తోరణం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశాం.

– భళ్ల నీలకంఠం, ఈఓ, పంచారామ క్షేత్రం, సామర్లకోట

అలరించిన జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో లక్ష పత్రి పూజలు చేసుకున్న వారి కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు గురువారం జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. అమృత హాస్పటల్ అధినేత రాజ్ కుమార్ కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజలు చేసుకున్నారు. పూజల అనంతరం జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు.

వైభవంగా నందీశ్వరుని ఊరేగింపు



కొత్తపల్లిలో నందీశ్వరుని ఊరేగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేట, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం నందీశ్వరుని ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఆయా గ్రామాల్లో గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏటా కార్తిక పౌర్ణమికి ముందు నందీశ్వరుని ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు గురువారం ఒక మహిళను ఉపవాసం ఉంచి శివశంకరులుగా భావించి నందీశ్వరుని గ్రామంలో ఊరేగించారు. అనంతరం గౌరీదేవి వద్ద నందీశ్వరుని ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు కార్తిక దీపం (అఖండ జ్యోతి)ని వెలిగించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా శివ పార్వతుల ప్రతిరూపంగా కొలిచే నందీశ్వరుని కార్తిక పౌర్ణమికి మూడు రోజుల ముందు ఊరేగించి నిమజ్జనం చేయించడం ద్వారా సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీనిలో భాగంగా ఊరేగింపులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉన్నత స్థానం

- ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ప్రవీణ్‌బాబు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రవీణ్‌బాబు, విజయ్‌ప్రకాష్



నవోదయలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దాపురం: విద్యార్థులు కష్టపడి విద్యనభ్యసిస్తేనే ఉన్నత స్థానాలు సాధించవచ్చని కాకినాడ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ పి.ప్రవీణ్‌బాబు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షత వహించారు. ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, వారి భవిష్యత్తుకు బాటలు వేసేందుకు బాల్య దశ నుంచే అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ రాయవరపు సత్య మాట్లాడుతూ, విద్యార్థుల ఆలోచనలు మేధస్సు పెంచే విధంగా ఉండాలన్నారు. తొలుత విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో బాలల దినోత్సవం జరిగింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకష్టయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

నేటి పిల్లలే రేపటి సమాజ సారథులు

సామర్లకోట: నేటి బాలలే రేపటి సమాజ ప్రగతి సారథులని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతో పాటు, సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనించి, మంచి విషయాలను తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి వివిధ పోటీలను నిర్వహించి, ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రతి విషయంలోను పోటీతత్వం ఉండాలని సూచించారు. మంచి,చెడులను ముందుగా గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. బాలల భవిషత్తును తీర్చి దిద్దడానికి విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పిల్లలు ఏ రంగంలో ఎక్కువ శ్రద్ధ చూపుతారో గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు అందజేశారు.



శాంతివర్ధనలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధి

సామర్లకోట: గ్రామాల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికలను తయారు చేయడం ద్వారా ఆయా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంఈడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులకు గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల నిత్యావసరాలతో పాటు, గ్రామాల్లోని యువతకు కావాల్సిన అవసరాలను గుర్తించాలన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, వ్యవసాయ రంగంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించడం, మార్కెటింగ్ వంటి సదుపాయాలపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ప్రణాళికల ఆధారంగానే ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి, ప్రజలు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలన్నారు. ఈఓపీఆర్డీ బైరవమూర్తి, రీసోర్స్‌పర్సన్లు తోట సత్యనారాయణ, సునీల్‌కుమార్, ఎ.భారతి, పి.నాగేశ్వరరావు శిక్షణ నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్‌గా ఎంపీడీఓ, అసిస్టెంట్ డైరెక్టర్‌గా బైరవమూర్తి వ్యవహరించారు.



సామర్లకోటలో జరిగిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అట్టహాసంగా సహకార వారోత్సవాలు ప్రారంభం

పెద్దాపురం: మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో గురువారం సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మసకపల్లి శ్రీరంగనాయకులు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీరంగనాయకులు, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, రైతులు సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాన్నారు.



ఆర్‌బీ పట్నంలో సహకార పతాకావిష్కరణ చేస్తున్న శ్రీరంగనాయకులు

మా భూమిని ఇప్పించండి



సమావేశంలో మట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర రావు

కొత్తపల్లి: బీసీ వర్గానికి చెందిన వ్యక్తి నుంచి భూమిని దౌర్జన్యంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, తిరిగి ఇవ్వడానికి సొమ్ము వసూలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మూలపేటకు చెందిన వడగా శ్రీరాములు అనే రాంబాబు తన మిత్రుడైన ఉమామహేశ్వర రావు సమక్షంలో 2011లో హైదరాబాద్‌కు చెందిన చిలకమర్తి చంద్రశేఖర్, శ్రీకాంత్‌లకు చెందిన కేఎస్ఈజెడ్ పరిధిలో ఉన్న 50 సెంట్ల భూమిని రూ.3 లక్షలకు కొనుగోలు చేశారు. 2023 కేఎస్ఈజెడ్ అవార్డులో ఉన్న భూమిని తిరిగి చంద్రశేఖర్, శ్రీకాంత్‌లకు ఇచ్చేసి డబ్బు ఇవ్వాలని కోరాడు. అవార్డులో ఉన్న భూమి తిరిగి వస్తుందని ఆ వెంటనే శ్రీరాములుకు రిజిస్ట్రేషన్ చేస్తామని నమ్మించారు. అనంతరం ఒక నాయకుడి అండతో వేరొకరికి దానిని రిజిస్ట్రేషన్ చేసేశారు. దీనిపై శ్రీరాములు పెద్దల సమక్షంలో పెట్టగా 23 1/2 సెంట్ల భూమిని రాసిచ్చి, మిగిలిన భూమి ఇచ్చేందుకు కాలయాపన చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈ విషయమై తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని వెంకటేశ్వరరావు వివరించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, తనకు న్యాయం చేయాలని హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఎస్పీలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.

మహానుభావుల జీవిత చరిత్రను తెలుసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: జాతీయ నాయకుల జీవిత చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ, చిన్నతనం నుంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి యువతకు గ్రంథాలయం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. మరో ముఖ్య అతిథి ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమానికి గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అధ్యక్షత వహించారు. నిత్యం విద్యార్థులను చైతన్యపర్చేలా వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి టి.నళినీ ప్రియ ఆధ్వర్యంలో వీఆర్వో సురేష్ వారోత్సవాలను ప్రారంభించారు. తొలుత బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్, ఎంఈఓ




ఉప్పాడలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ పద్మావతి

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. గురువారం స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి లైబ్రేరియన్ పాలంకి నాగరాజు అధ్యక్షత వహించారు. కమిషనర్ పద్మావతి మాట్లాడుతూ, డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పుస్తక పఠనంతో విద్యార్థులు మంచి జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. తొలుత నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు.



సభలో మాట్లాడుతున్న కమిషనర్ పద్మావతి